క్లుప్తంగా

గ్రంథాలయాలతో విజ్ఞానం



విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న డైరెక్టర్ కృష్ణమోహన్

శ్రీకాళహస్తి: యువత, విద్యార్థులు, ప్రజలు గ్రంథాలయాల్లో ఉన్న పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలని రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ డైరెక్టర్ కృష్ణమోహన్ అన్నారు. పట్టణంలోని గ్రేడ్-1 గ్రంథాలయాన్ని చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌వీఆర్‌ఎస్‌ఎస్ శర్మతో కలిసి సందర్శించారు. గ్రంథాలయంలో ఉన్న పాఠకులతో మాట్లాడి ఎలాంటి సేవలు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. చదవడం మాకు ఇష్టం క్విజ్ పోటీలను నిర్వహించి విజేత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి లావణ్య పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

రేణిగుంట: మెగా ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. పంచాయతీలోని స్థానిక ఓల్డ్ చెక్ పోస్ట్ సమీపంలోని ఇన్ఫాంట్ జీసస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఆదివారం ఆర్‌సీఎం చర్చ్ ఆధ్వర్యంలో నారాయణాద్రి హాస్పిటల్, వాసన్ ఐ కేర్ ఆస్పత్రి సంయుక్త సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. నారాయణాద్రి ఆస్పత్రి వైద్య బృందం వైద్యపరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు. వాసన్ ఐ కేర్ హాస్పిటల్ వైద్య బృందం కంటి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. జూలియస్ రాజు, ప్రేమ్ కుమార్, జయరాజ్ ప్రభు పాల్గొన్నారు.

కాలువలో పడి వృద్ధురాలికి గాయం



గాయపడిన వృద్ధురాలు

శ్రీకాళహస్తి: కాలువలో పడి ఓ వృద్ధురాలి కాలికి గాయమైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పట్టణంలోని పెళ్లి మండపం వద్ద ఆదివారం ట్రాఫిక్ ఎక్కువగా ఉండడంతో ఓ వృద్ధురాలు ఎదురుగా వస్తున్న ఆటోను తప్పుకునే క్రమంలో అదుపుతప్పి కాలువలో జారి పడింది. కాలువకు ఉన్న ఇనుప కమ్మీల్లో ఆమె కాలు ఇరుక్కుపోయి తీవ్రగాయమైంది. గుర్తించిన పోలీసులు, స్థానికులు ఆమెను శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు.

మన్ కీ బాత్‌కు విశేష స్పందన

శ్రీకాళహస్తి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహిస్తున్న మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రపంచవ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోందని తిరుపతి జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప తెలిపారు. ఆదివారం ఆయన కుటుంబ సభ్యులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కండ్రిగ ఉమ, 109వ పోలింగ్ బూత్ అధ్యక్షురాలు ప్రియాంక, పోలింగ్ బూత్ సభ్యులు పరంజ్యోతి, వార్డు సభ్యులతో కలిసి టీవీలో మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు.

భక్తిశ్రద్ధలతో సత్సంగ్



పుష్పపల్లకీలో విహరిస్తున్న బాబా

నారాయణవనం: మండలంలోని పాలమంగళం ఉత్తరపుకండ్రిగలో సాయినాథుడి పంచమ వార్షికోత్సవ ఆరాధన ఆదివారం సత్సంగ్ కేంద్రంలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామంలోని సాయిబాబా సత్సంగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనా మందిరంలో భక్తులు సాయిబాబాను, గురువు శరత్‌బాబా చిత్రపటాలను పుష్పగుచ్ఛాలతో అలంకరించి ధ్యానంలో పాల్గొన్నారు. సాయంత్రం పుష్పపల్లకిలో బాబా చిత్రపటాన్ని ఊరేగించారు.

వీడ్కోలు సన్మానం



మణిశంకర్‌ను సన్మానిస్తున్న అంజూరు

శ్రీకాళహస్తి: పుత్తూరు పురపాలకసంఘంలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీకాళహస్తికి చెందిన మోదుగుల గోపాలయ్య మణిశంకర్ సేవలు ప్రశంసనీయమని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. గోపాలయ్య మణిశంకర్ ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించి ముక్కంటి జ్ఞాపికను అందజేశారు. శ్రీవారి సురేష్, మొగరాల గణేష్, బాలిశెట్టి విజయ్‌శేఖర్, పూడి రవికుమార్ పాల్గొన్నారు.

వినాయక.. సెలవిక

శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజక వర్గాల్లో కొలువుదీరిన గణపయ్య విగ్రహాలను ఆదివారం కోలాహలంగా నిమజ్జనం చేశారు. గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల వద్ద అన్నదానం చేశారు. యువత రంగులు చల్లుకుంటూ ఉట్టి కొడుతూ సందడి చేశారు. అనంతరం విగ్రహాలను వాహనాలపై కొలువుదీర్చి, యువత కేరింతల మధ్య మేళతాళాలతో, బాణసంచా పేల్చుతూ ఊరేగింపుగా తీసుకెళ్లి సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందో బస్తు ఏర్పాటు చేశారు.

- కోలాహలంగా గణపయ్యల నిమజ్జనం
- మండపాల వద్ద అన్నదానం
- ఉట్టి కొడుతూ యువత కేరింతలు





బుచ్చినాయుడుకండ్రిగలో ఊరేగుతున్న వినాయకుడు, వరదయ్యపాళెం: విజ్ఞాన్‌నగర్‌లో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న స్థానికులు, నారాయణవనం: నిమజ్జనం ఊరేగింపు

రేణిగుంట: పట్టణంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలను ఆదివారం ఊరేగించి కోలాహలంగా నిమజ్జనం చేశారు. జీఎం స్ట్రీట్‌లో అభయ వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో నిమజ్జనం నిర్వహించారు. మధ్యాహ్నం గుంటూరు మెస్, డాక్యుమెంట్ రైటర్ రమేష్ సంయుక్త ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నస్వామిపల్లిలో జరుగుతున్న ఉత్సవాల్లో లడ్డూను రూ.లక్ష వేలంపాటలో కరణం మునిరెడ్డి కుమారుడు గోపాల్‌రెడ్డి దక్కించుకున్నాడు.

వరదయ్యపాళెం: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక విగ్రహాలకు నిమజ్జన ఘట్టాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం డప్పులు, వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ యువత నృత్యాలతో నిమజ్జనానికి వినాయక విగ్రహాలను తరలించారు. ప్రత్యేకించి లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలుచోట్ల నిర్వహించిన మట్టి విగ్రహాలను కోలాటాల నృత్యాలతో సందడిగా నిమజ్జనోత్సవానికి తీసుకెళ్లారు.

సత్యవేడులో..

సత్యవేడు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సత్యవేడులో ఆదివారం సాయంత్రం గంగమిట్ట వీధి, శివాలయం వీధి, దేవాంగపురం వీధి, కాళమనాయుడుపేట, నరసరాజు అగ్రహారంలో మహిళలు సారె ఊరేగింపు నిర్వహించారు. వినాయకుడికి వివిధ రకాల పిండి వంటలు సమర్పించారు. మంగళవాయిద్యాలు, నడుమ మహిళలు కోలాటం నృత్యాలు చేశారు. పలు ప్రాంతాల్లో ఉట్లు కొట్టారు. యువకులు, మహిళలు రంగులు చల్లుకుంటూ నిమజ్జన ఘట్టాన్ని నిర్వహించారు. పలు గ్రామాల్లో చెరువులు, తెలుగుగంగ కాలువలో గణేశుడి ప్రతిమలను నిమజ్జనం చేశారు. పలుచోట్ల భక్తులకు అన్నదానం చేపట్టారు.

తొట్టంబేడులో..

తొట్టంబేడు: సంబరాల మధ్య నిమజ్జన వేడుకలు ఆదివారం కోలాహలంగా జరిగాయి. చుక్కలనిడిగల్లులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని ఆదివారం సాయంత్రం నిమజ్జనం చేశారు. వేడుకలకు శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపి, రెండవ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి హాజరయ్యారు. చుక్కల పవన్, ఖుషి, నవీన్, భరత్, వినయ్, కార్తీక్, సిద్ధు, సునీల్ పాల్గొన్నారు.

నారాయణవనంలో...

నారాయణవనం: మండల వ్యాప్తంగా గణేశ్ నిమజ్జన వేడుకలు అంబరాన్నంటాయి. చవితి రోజు కొలువుదీరిన గణనాథుడు ఐదు రోజుల పాటు భక్తుల నుంచి పూజలందుకున్నాడు. ఆదివారం నిమజ్జనం సందర్భంగా పలుచోట్ల ఉత్సవ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక వీరరాఘవ దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన భారీ విగ్రహానికి మధ్యాహ్నం ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 500 మందికి అన్నప్రసాదాలు వితరణ చేశారు. నారాయణవనం పురవీధుల్లో డీజే మ్యూజిక్, డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి సమీపంలోని అరుణానదిలో నిమజ్జనం చేపట్టారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ రవీంద్ర, ఎస్‌ఐ రాజశేఖర్ సిబ్బందితో బందోబస్తు పర్యవేక్షించారు.

ఘనంగా గణేష్ నిమజ్జనం

బుచ్చినాయుడుకండ్రిగ: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని వాడవాడలా కొలువుదీరిన గణపతులను ఆదివారం సాయంత్రం నిమజ్జనం చేశారు. జైబోలో గణేష్ మహరాజ్‌కీ జై అంటూ ఐదు రోజులుగా పూజలందుకున్న గణనాథులను నిమజ్జనానికి తరలించారు. ముందుగా వినాయకులకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి వాహనాలపై కూర్చోబెట్టి మేళతాళాల మధ్య గ్రామాల్లో ఊరేగించారు. యువకులు ఉత్సాహంగా ఉట్టి కొట్టారు. గ్రామాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నరసరాజు అగ్రహారంలో కోలాటం



అన్నాస్వామిపల్లిలో లడ్డూను సొంతం చేసుకున్న భక్తుడు



శ్రీకాళహస్తి: పూజకు హాజరైన సీఐలు, చుక్కలనిడిగల్లు గ్రామస్తులు



నారాయణవనం: అన్నప్రసాదాలను స్వీకరిస్తున్న భక్తులు

వృథాగా ఏపీఐఐసీ భూములు

- పరిశ్రమలు వచ్చేదెప్పుడో ?
- మంత్రి, కమిషనర్ వచ్చినా ముందుకు సాగని పనులు
- కూటమి ప్రభుత్వంలో ఆగిన అభివృద్ధి పనులు



అలత్తూరు గ్రామం వద్ద వృథాగా ఉన్న ఏపీఐఐసీ భూములు

బుచ్చినాయుడుకండ్రిగ: పరిశ్రమల ఏర్పాటే కూటమి ప్రభుత్వ ధ్యేయమని గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆ దిశగా అడుగులు వేయకపోవడంతో పరిశ్రమలకు కేటాయించిన భూములు వృథాగా ఉన్నాయి. మండలంలోని ఆలత్తూరు, బీఎస్‌పురం, కొత్తపాళెం గ్రామాలతో పాటు తొట్టంబేడు మండలం రౌతుసూరమాల గ్రామాల్లోని భూములను ఏపీఐఐసీ కేటాయించారు. మండలంలోని ఆలత్తూరు, బీఎస్‌పురం, కొత్తపాళెం గ్రామాల్లోని 2095 ఎకరాల భూములకు సంబంధించి గత ప్రభుత్వం హయాంలో రైతులకు భూనష్టపరిహారాన్ని చెల్లించారు. గత ప్రభుత్వ హయాంలో ఏపీఐఐసీ భూముల్లో లింకు రోడ్ల పనులు శరవేగంగా జరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్డు పనులు నిలిచిపోయాయి. భూముల అభివృద్ధి ప్రభుత్వం నిధులను కేటాయించక పోవడంతోనే పనులు నిలిచి పోయాయంటున్నారు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఏపీఐఐసీ భూముల పరిస్థితి మారింది. పరిశ్రమలు వస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, పని ఉంటుందని భూములను ఇస్తామని రైతులు అంటున్నారు. పంటలు పండే సాగు భూములు నిరుపయోగంగా ఉన్నాయని వాపోతున్నారు. గత సంవత్సరం ఆగస్టు నెలలో రాష్ట్ర పరిశ్రమలశాఖ కమిషనర్ యువరాజ్ ఏపీఐఐసీ భూములను సందర్శించి త్వరితగతిన భూములను అభివృద్ధి చేసి, పరిశ్రమలను స్థాపిస్తామని చెప్పి వెళ్లారు. ఈ సంవత్సరం ఏప్రిల్‌లో సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఏపీఐఐసీ భూములను పరిశీలించి, మండలంలోని ఆలత్తూరు, బీఎస్‌పురం, కొత్తపాళెం గ్రామాలతో పాటు తొట్టంబేడు మండలంలోని రౌతుసూరమాల గ్రామంలోని ఏపీఐఐసీకి సంబంధించిన భూములను అభివృద్ధి చేసి, 80 పరిశ్రమల ఏర్పాటుకు కేటాయించినట్లు, నెలరోజుల్లో పరిశ్రమలకు శంకుస్థాపన చేస్తామని చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి పరిశ్రమల అభివృద్ధి కీలకమని, భూముల్లో లింకు రోడ్ల పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించి నాలుగు నెలలైనా పట్టించుకున్న వారే లేరని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు కావొస్తున్నా.. భూముల్లో తట్టడు మట్టి వేసిన పాపాన పోలేదని రైతులు అంటున్నారు. ఇప్పటికైన సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి భూములను అభివృద్ధి చేసి, పరిశ్రమలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.





ఏపీఐఐసీ భూముల బోర్డు, ఏపీఐఐసీ భూములతోపాటు రికార్డులను పరిశీలిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్(ఫైల్)



భూములను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశ్రమలశాఖ కమిషనర్ యువరాజ్ (ఫైల్)

వంతెనపై గుంతలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు గ్రామ సమీపంలోని కాళంగి నది వంతెనపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వంతెన నిర్మించి 20 ఏళ్లు కావొస్తోంది. అయితే వంతెనపై ఉన్న రోడ్డులో పెద్ద గుంతలు పడడంతో వర్షం పడినప్పుడు నీరు చేరుతుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ దారిలో రోజూ వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతాయి. రోడ్డుపై ఉన్న గుంతల్లో వాహనదారులు పడి గాయాలపాలు అవుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులకు పలుమార్లు వంతెన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి కాళంగినది వంతెన పైన పడిన గోతులను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.




వంతెన రోడ్డుపై ఉన్న గుంతలు

సూచిక బోర్డులతో అయోమయం

- కిలోమీటర్లు తిరిగి వస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి తిరుపతి నుంచి వచ్చే మార్గంలో చెర్లోపల్లి నుంచి ఒక రోడ్డు శ్రీకాళహస్తి వైపు ప్రవేశిస్తుంది. ఆ రోడ్డులో నేరుగా వస్తే ఆలయానికి చేరుకోవడం సులభం అవుతుంది. అయితే ఏపీ టూరిజం వద్ద ఉన్న వంతెన పైకి చూపించే విధంగా ఆలయ సూచికబోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో కాసా గార్డెన్ వరకు వెళ్లి అక్కడి నుంచి నాయుడుపేట రోడ్డుమీదుగా శ్రీకాళహస్తి రోడ్డులోకి ప్రవేశించాల్సి వస్తోంది. భక్తులు కిలోమీటర్ల మేర తిరిగి రావాల్సిన పరిస్థితి సూచికబోర్డుల వల్ల ఏర్పడుతోంది. చెర్లోపల్లి నుంచి వస్తే రెండు, మూడు కిలోమీటర్ల మేర దూరం తగ్గుతుంది. చెర్లోపల్లి సర్వీసు రోడ్డు వద్ద కూడా ఆలయానికి దారి చూపిస్తూ బోర్డు ఏర్పాటు చేస్తే సర్వీసు రోడ్డు ద్వారా ఆలయానికి భక్తులు చేరుకుంటారు. ఇది గమనించకుండా ఆలయ అధికారులు సరైన సూచికబోర్డులు పెట్టే పరిస్థితి లేదు. ఆలయ అధికారుల అవగాహన లోపంతో భక్తులు ఇక్కట్లు పడుతున్నారని పలువురు అంటున్నారు.




ఆలయం దారి చూపే సూచిక బోర్డులు

వైఎస్సార్‌సీపీ, టీడీపీ వర్గీయుల ఘర్షణ

తొట్టంబేడు: మండలంలోని కొణతనేరి హరిజన వాడలో ఆదివారం రాత్రి వైఎస్సార్‌సీపీ, టీడీపీ వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఐదుగురికి గాయాలయ్యాయి. ముగ్గురికి తీవ్రగాయాలు కాగా, ఒక మహిళకు చెయ్యి విరిగింది. గాయపడ్డ వీరిని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. తొట్టంబేడు పోలీసులు కేసు నమోదు చేశారు.

కోదండరామాలయంలో విశేష ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: కోదండరామస్వామి ఆలయంలో ఈ నెలలో పలు విశేష ఉత్సవాలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా ఈ నెల 6, 13, 20, 27వ తేదీల్లో ఉదయం 6 గంటలకు శ్రీసీతారామ లక్ష్మణుల మూలవర్లకు అభిషేకం చేస్తారు.

చినుకుపడితే చిత్తడే!



కోవూరుపాడు మార్గంలలో బావులను తలపిస్తున్న వర్షపు నీటి గుంతలు




బురదమయంగా కోవూరుపాడు ప్రధాన రోడ్డు

- ఛిద్రమైన కోవూరుపాడు రోడ్డు
- బావులను తలపిస్తున్న వర్షపు నీటి గుంతలు


వరదయ్యపాళెం: మండలంలోని యానాదివెట్టు పంచాయతీలోని కోవూరుపాడుకు వెళ్లే ప్రధాన రోడ్డు చినుకు పడితే చిత్తడవుతుంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆ రోడ్డు పూర్తిగా బురదమయంగా మారడంతోపాటు బావులను తలపించే వర్షపునీటి గుంతలతో వాహనదారులు, స్థానికులు ఆ మార్గంలో వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక నడిచి వెళ్లేవారు కూడా నీటి గుంతల్లో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి. గడిచిన నాలుగేళ్ల క్రితం గ్రామీణ రోడ్ల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అందులో భాగంగా ఈ రోడ్డుకు సంబంధించి 550 మీటర్ల దూరం సిమెంటు రోడ్డు నిర్మాణం కోసం రూ.39లక్షల నిధులు మంజూరు చేసింది. అయితే సకాలంలో బిల్లులు రాని కారణంగా పనులు చేజిక్కించుకున్న కాంట్రాక్టర్ అర్ధంతరంగా పనులు నిలిపివేయడం జరిగింది. దీంతో మూడు కల్వర్టులు మాత్రం నిర్మించి ఎర్త్‌వర్క్ ద్వారా రోడ్డు కిరువైపులా సైడు బర్మలు నిర్మాణంతో పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం ఈ మార్గంలో వెళ్లాలంటే స్థానిక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఛిద్రమైన రోడ్డు బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నరకయాతన పడుతున్నాం




పెద్ద పాండూరు ప్రధాన రోడ్డు నుంచి మా ఊరికి వెళ్లేందుకు అర కి.మీ దూరం రాకపోకలకు నరకయాతన పడుతున్నాం. అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం స్పందించాలి. –జయసూర్య, కోవూరుపాడు

వర్షమొస్తే అవస్థలే



ఇటీవల కురుస్తున్న వర్షాలకు మా ఊరి రోడ్డు ఛిద్రమైంది. బావులను తలపించే విధంగా రోడ్డు పొడవునా గుంతలు ఏర్పడి నీటి నిల్వలు ఉన్నాయి. ఈ మార్గంలో మోటారు బైకుపై వెళుతూ జారిపడుతూ ప్రమాదాలకు గురవుతున్నాం. వెంటనే ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేసి రోడ్డు బాగు చేయాలి. –కిరణ్, కోవూరుపాడు

రోడ్డును బాగు చేయండి



మా ఊరి రోడ్డుపై వెళ్లాలంటే భయమేస్తోంది. బురదమయంగా ఉన్న రోడ్డుపై కాలు తీసి కాలు వేయలేని దుస్థితి నెలకొంది. ఈ రోడ్డు గురించి అనేకమార్లు ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా స్పందించకుంటే ఆందోళనకు దిగుతాం. –రాంబాబు, కోవూరుపాడు